క్లుప్తంగా

ఉచితంగా కంటి ఆపరేషన్లు



శస్త్ర చికిత్స చేసుకున్నవారితో ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలటౌన్: జగిత్యాల పావని కంటి ఆస్పత్రి, ఆపి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన 13 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కంటి శస్త్ర చికిత్సలు చేసి, కంటి అద్దాలు, మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తిలో భాగంగా ఎంతోమంది పేదలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో నేత్ర సమస్యలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీవీ సూర్యం, సొల్లు సురేందర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహుడి చెంత మురుగునీటి చింత



భారీ వర్షంతో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ముందు మురుగునీటితో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కురిసిన భారీ వర్షంతో వర్షం నీరంతా డ్రైనేజీలోకి చేరడంతో డ్రైనేజీ పొంగిపొర్లింది. దీంతో దైవదర్శనం కోసం వచ్చే భక్తులు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దేవస్థానం ముందున్న డ్రైనేజీ సరిగా లేక పోవడంతో ప్రతిసారి ఈ సమస్య ఎదురవుతుందని వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై చేరిన నీరంగా చెరువులా తలపించింది. సమస్యను పరిష్కరించాలని కోరుచున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న నాయకులు

ధర్మపురి: రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పెళ్లిరోజు వేడుకలను ఆదివారం కాంగ్రెస్ మండలశాఖ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మంత్రి పెళ్లిరోజు వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో దంపతులు గోత్తనామాలతో ప్రత్యేక పూజలు జరిపించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మల్లాపూర్: రైతుబీమా పథకం కోసం అర్హులైన రైతులు ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత జూన్ 5 వరకు కొత్త పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులు బీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 నుంచి 59 ఏళ్ల లోపు రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డుతో ఏఈవోకి గాని, వ్యవసాయశాఖ కార్యాలయంలో గాని దరఖాస్తు సమర్పించాలని కోరారు.

మల్యాల: జూన్ 5 వరకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు ఈ నెల 13లోగా రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్, ఏఈవో కారుణ్యకుమార్ తెలిపారు. రైతు భీమా కోసం దరఖాస్తుతోపాటు రైతు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ జత చేసి, స్థానిక వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సారంగాపూర్: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు భీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల వ్యవసాయాధికారి ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. 2025–26 రైతుబీమా కోసం కొత్తగా పట్టేదారు పుస్తకాలు పొందిన రైతులు ఈ నెల 13లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 5వరకు పట్టాపాసుపుస్తకం వచ్చిన రైతులు, ఇప్పటి వరకు అర్హత ఉండి రైతు బీమా చేసుకోని రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇబ్రహీంపట్నం: రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోని రైతులు ఈనెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ అధికారి రాజుకుమార్ ఆదివారం తెలిపారు.

బల్దియాలో దొంగల బెడద

- భయాందోళనలో పట్టణ ప్రజలు
- పనిచేయని సీసీకెమెరాలు
- గ్రామాల్లో మోటార్లు చోరీ
- పట్టించుకోని పోలీసులు

రాయికల్: రాయికల్ పట్టణంలో వరుస దొంగతనాలతో బల్దియా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సీసీకెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా దొంగతనాలకు పాల్పడుతున్నారు. పోలీసులు కేవలం పట్టణంలోనే మెయిన్ రోడ్ల మీదే గస్తీ తిరగడంతో దొంగలు తాళం వేసి ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల రాయికల్‌లో చింత ప్రకాశ్, మోర శంకర్, ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో, పట్టణంలోని జీఎంఆర్ ఎలాక్ట్రిషన్ దుకాణంలో వరుసగా చోరీలు జరిగినప్పుడే పోలీసు సిబ్బంది సీసీ కెమెరాలు ఎక్కడ పనిచేస్తున్నాయని 2–3 రోజుల పాటు వెతికి వదిలేయడం పరిపాటిగా మారింది.అంతే కాకుండా మండలంలోని పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో కుమ్మరిపెల్లి గ్రామాల్లో వరుసగా పంచాయతీ బాల్‌రాజ్, బోంగు రాజులకు చెందిన వ్యవసాయల మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లారు.

సీసీకెమెరాలు పని చేయక యథేచ్ఛగా చోరీలు

రాయికల్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మూడేళ్ల క్రితం రూ.20 లక్షల వ్యయంతో రాయికల్ పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద 22 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీకెమెరాల టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పర్యవేక్షణ లేకపోవడంతో ఉన్న సీసీకెమెరాలు సైతం పనిచేయడం లేదు. దీంతో పట్టణంలో దొంగతనాలు జరుగుతున్న సమయంలో పోలీసులకు దొంగలను పట్టుకోవడంలో ఇబ్బంది అవుతోంది. ఒకవైపు జిల్లా ఎస్పీ బల్దియాలో, గ్రామాల్లో సీసీకెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆచరణలో మాత్రం శూన్యంగా మారింది. ఇప్పటికైనా బల్దియాలో సీసీకెమెరాలను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బల్దియాలో పనిచేయని సీసీకెమెరాలు



రాయికల్‌లో దొంగతనం జరిగిన ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

భయంగా ఉంది



రాయికల్ పట్టణంలో ఇటీవల వరుస దొంగతనాలతో భయాందోళనకు గురవుతున్నాం. మా ఇంట్లో దొంగతనం జరిగి నెల రోజులు గడుస్తున్నా.. ఎలాంటి పురోగతి లేదు. పోకిరీల బెడద సైతం తీవ్రంగా ఉంది. రాత్రి పూట ద్విచక్ర వాహనాలపై విచ్చలవిడిగా ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. దొంగతనాలను, పోకిరీలను నియంత్రించాలి.

– చింత ప్రకాష్ రాయికల్

సీసీకెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం



దొంగతనాల నిర్మూలనకు గస్తీ తిరగడంతో పాటు పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీకెమెరాలను వినియోగంలోకి తెచ్చేలా కృషి చేస్తున్నాం. ప్రజలు సైతం తమ దుకాణాల వద్ద స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నాం.

– సుధీర్‌రావు, ఎస్సై



పెగడపల్లి: మండలంలోని బతికపల్లి ఊర వాగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన మరమ్మతులు లేక ప్రమాదకరంగా మారింది. ఇరువైపులా తారు రోడ్డు నిర్మించి వంతెన మరమ్మతులు వదిలేశారు. నిత్యం వందలాది ద్విచక్ర వాహనాలతో పాటు పెగడపల్లి నుంచి జగిత్యాల వైపు వెళ్లే ఆర్టీసీ బసు సర్వీసులు ఇక్కడి నుంచే వెళ్తుంటాయి. శిథిలావస్థలో ఉన్న వంతెన తొలగించి పునర్‌నిర్మాణం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి అవస్థలు తొలగించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ, జగిత్యాల సెల్ నంబర్: 9440818090

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

రోడ్లు ఇలా.. వెళ్లేదెలా..



చిన్నమెట్‌పల్లి-వెంకటాపూర్ మధ్య అధ్వానంగా తయారైన లింకురోడ్డు

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లి–వెంకటాపూర్ గ్రామాల మధ్య లింకురోడ్డు దెబ్బతిని వాహనాలు నడవటం ఇబ్బందిగా మారింది. కోరుట్ల నుంచి చిన్నమెట్‌పల్లికి రాకపోకల కోసం షార్ట్‌కట్‌గా ఈ లింకురోడ్డునే ఎక్కువగా వినియోగిస్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతిని ప్రయాణం ఇబ్బందిగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇదే దారి గుండా మోడల్ స్కూల్ బస్సు కూడా వెళ్తుండటంతో బస్సు ఎప్పుడు దిగబడుతుందోననే ఆందోళన నెలకొంది. కోరుట్ల నుంచి మోహన్‌రావుపేట మీదుగా చిన్నమెట్‌పల్లి వెళ్లే కంటే వెంకటాపూర్–చిన్నమెట్‌పల్లి లింక్ రోడ్ మీదుగా వెళ్తే సుమారు 5 కిలో మీటర్ల దూరబారం తగ్గుతుందని ప్రజలు ఈ రోడ్డునే ఎక్కువగా వినియోగిస్తున్నారు. వర్షాకాలం రోడ్డు బురదమయమై వాహనాల రాకపోకలు ఇబ్బందిగా మారిందని, ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి , ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకుసాగాలి

జగిత్యాలటౌన్: బోధించు, సమీకరించు పోరాడు అన్న అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంటె అంజయ్య అన్నారు. ప్రతీ ఆదివారం అంబేడ్కర్ స్మరణలో భాగంగా ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) ఆధ్వర్యంలో తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ రాజ్యాంగ రచన బాధ్యతలు స్వీకరించి ప్రపంచంలోనే అత్యంత గొప్ప రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం లాంటి అంశాలను పొందుపరిచి అమూల్యమైన రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్‌ను ప్రతీ ఆదివారం స్మరించుకోవడం అదృష్టమన్నారు. వారి ఆలోచనలు, ఆశయాలతో భవిష్యత్తు తరాలు స్ఫూర్తి పొందాలని సూచించారు. కార్యక్రమంలో డిక్కీ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్యాం, బాలమురళీకృష్ణ, ఎస్ గంగారాం, రాజేశ్వర్‌రావు, మద్దెల నారాయణ, అనంతుల కాంతారావు, అంబేడ్కర్ వాదులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న అంజయ్య, నాయకులు

గడి బురుజుల పరిరక్షణకు న్యాయపోరాటం

కోరుట్ల: పట్టణంలో చారిత్రక నేపథ్యం ఉన్న కోరుట్ల గడి బురుజుల పరిరక్షణకు న్యాయ పోరాటం చేస్తామని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్, సీపీఐ సీనియర్ నాయకుడు చెన్నా విశ్వనాథం అన్నారు. ఈ మేరకు హైకోర్టు రిటైర్డ్ జడ్జి బి. చంద్రకుమార్‌తో చర్చించినట్లు ఆదివారం తెలిపారు. గడి బురుజుల పరిరక్షణకు ఉద్యమాలు చేపట్టినా ఫలితం లేదని, అందుకే న్యాయ పోరాటం ఒక్కటే మార్గంగా కనిపిస్తుందన్నారు. 3.01 ఎకరాల గడి బురుజుల స్థలం ఆక్రమణకు గురైందని పేర్కొన్నారు. త్వరలోనే న్యాయ పోరాటానికి సిద్ధమవుతామని, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ సంబంధిత ఫైళ్లను పరిశీలించారని పేర్కొన్నారు.



హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్‌తో నాయకులు

తారురోడ్డు ధ్వంసం చేసిందెవరో..?



భూషణరావుపేట- చింతకుంట గ్రామాల మధ్య ధ్వంసమైన తారురోడ్డు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట–చింతకుంట గ్రామాల మధ్య తారు రోడ్డును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు రెండు గ్రామాల ప్రజలు ఆదివారం తెలిపారు. తారు రోడ్డును ఏదో మిషన్‌తో తవ్వించి విధ్వంసకరంగా చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. తారు రోడ్డును యథేచ్ఛగా ధ్వంసం చేసిన సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు దృష్టి సారించి తారు రోడ్డును ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సామాజిక సేవకుడికి అంబేడ్కర్ ఇంటర్నేషనల్ అవార్డు



ఆనంద్

మేడిపల్లి: ప్రతీ సంవత్సరం టోలాసు మెక్సికో (అమెరికా) యూనివర్సిటీ ఆధ్వర్యంలో విశిష్ట సేవలకు గాను అందిస్తున్న అంబేడ్కర్ ఇంటర్నేషనల్ అవార్డులను 2025–26 సంవత్సరానికి భీమారం మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన సామాజిక సేవకుడు, నిత్య రక్తదాత, జీర్డ్ స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు అంగడి ఆనంద్‌ను ఎంపిక చేసినట్లు తెలంగాణ రాష్ట్ర అవార్డు కోఆర్డినేటర్ కాయితి శంకర్ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 17న మహారాష్ట్రలోని సోలాపూర్‌లో అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు. అవార్డు రావడం పట్ల మండల దళిత సంఘాలు, మండల వాసులు ఆనంద్‌కు అభినందనలు తెలిపారు.

మున్నూరు కాపు వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

కోరుట్ల: పట్టణంలో మున్నూరు కాపు వెల్ఫేర్ యువజన సంఘం సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గుర్రాల విజయ్, ఉపాధ్యక్షుడిగా యాటం అరుణ్, ప్రధాన కార్యదర్శిగా పుప్పాల నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా గోపు శేఖర్, కోశాధికారిగా గాలి శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా యతిరాజం మహేశ్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

రేణుక గౌడ యువజన సంఘం అధ్యక్షుడిగా అంజన్న గౌడ్

రాయికల్: మండలంలోని అల్లీపూర్ రేణుక గౌడ యువజన సంఘంను సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంజన్న గౌడ్, ఉపాధ్యక్షుడిగా నరేశ్, కోశాధికారిగా శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా బట్టు సాగర్‌గౌడ్, సలహాదారులుగా దోసారపు జనార్దన్, బర్ల పవన్, తిరుమల భూమయ్య, జి రాజగోపాల్, తిరుమల మనోజ్ ఎన్నికయ్యారు.

ఎలక్ట్రికల్ షాపులో చోరీ

రాయికల్: పట్టణంలోని జీఎంఆర్ ఎలక్ట్రికల్ షాప్‌లో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దుకాణంలో ఉన్న 66 వేల నగదు దోచుకెళ్లినట్లు యజమాని గుజ్జుల కిరణ్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ పుటేజ్‌ని పరిశీలించగా ముగ్గురు యువకులు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు.

వదినపై దాడి చేసిన మరిదిపై కేసు

మల్యాల: వదినపై దాడి చేసిన మరిదిపై కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ముత్యంపేట దిగువ కొండగట్టుకు చెందిన జుంగోని వేంకటేశ్ తరచూ వదిన జుంగోని వర్షినితో గొడవపడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఆదివారం వర్షిని ఇంటికి వెళ్లి, బూతులు తిడుతూ దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

పరామర్శ

కోరుట్ల: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ అన్వర్‌ను జగిత్యాల జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆదివారం పరామర్శించారు. అన్వర్ ఇటీవల ప్రమాదానికి గురై చికిత్సపొందుతున్నాడు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు సజ్జు, రహీం పాషా, నాయకులు ఫయీం, పాల్గొన్నారు.

ఘనంగా శివ మల్లికార్జున స్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు



శివసత్తుల పూనకాలు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామ శివారుల్లో నూతనంగా నిర్మించిన శివ మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని లచ్చునాయక్ తండా గ్రామానికి చెందిన గుగ్లావత్ మల్లేష్ అనే గొర్ల కాపరి లచ్చునాయక్‌తండా, రేచపల్లి గ్రామ శివారుల్లోని కొత్త కుంట ప్రాంతంలో భూమిని చదును చేసే క్రమంలో శివ మల్లిఖార్జున స్వామి విగ్రహం బయల్పడింది. ఆలయాన్ని నిర్మాణం చేసి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఒగ్గు పూజారులు ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమానికి రేచపల్లి, లచ్చునాయక్‌తండా గ్రామస్తులు తరలివచ్చారు.

ప్రారంభించినా.. అందని వైద్య సేవలు



అరవెల్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖానా)

పెగడపల్లి: మండలంలోని అరవెల్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖాన భవనం) ప్రారంభానికే పరిమితమైంది. ఇక్కడ పల్లె దవాఖాన కోసం అన్ని వసతులతో కూడిన పక్కా భవనం రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించారు. జూలై 5న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా ఈ భవనాన్ని ప్రారంభించారు. భవనం ప్రారంభించి నెల రోజులు దాటినా నూతన భవనంలో వైద్య సేవలు అందుబాటులోకి రాలేదని స్థానికులు పేర్కొంటున్నారు. భవనం నిర్మింపజేసిన అధికారులు కనీస వసతులైన కరెంట్, నీటి సౌకర్యం కల్పించలేదని స్థానికులు వాపోతున్నారు. కరెంటు, నీటి సౌకర్యం లేక నూతన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నిరుపయోగంగా మారింది. ఈ విషయమై పెగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరేశ్‌ను సంప్రదించగా త్వరలో నూతన భవనంలో వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు.

విరిగిపడిన మర్రిచెట్టు కొమ్మ



మల్యాల: మండల కేంద్రంలోని అంగడి బజార్‌లోని మర్రిచెట్టు కొమ్మ ఆదివారం రాత్రి విరిగిపడింది. అదృష్టవశాత్తు మర్రిచెట్టు విరిగిపడినప్పుడు సమీపంలో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ గాయాలు కాలేదు. గ్రామ పంచాయతీ సిబ్బంది విరిగిపడిన మర్రిచెట్టు కొమ్మను తొలగించారు. సుమారు వంద ఏళ్ల నాటి మర్రి చెట్టు కావడంతో కొమ్మ విరిగి ఉంటుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

సీజ్ చేసిన ఇసుక డంపులకు వేలం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల సీజ్ చేసిన ఇసుక డంపులకు వేలం వేయనున్నట్లు తహసీల్దార్ నీత తెలిపారు. జగ్గాసాగర్‌లో 56, రామలచ్చక్కపేట 28, ఆత్మనగర్‌లో 299 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపులు నిల్వ ఉన్నాయనే సమాచారంతో సీజ్ చేశామన్నారు. మొత్తం 383 ట్రిప్పుల ఇసుక డంపులు సీజ్ చేశామని వాటన్నింటికీ మంగళవారం వేలం నిర్వహిస్తామన్నారు. డంపులు ఉన్న చోటే వేలం జరుగుతుందని, వేలంలో పాల్గొనే వారు ముందస్తుగా రూ.10 వేలు ధరావత్ చెల్లించాలని పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా:
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
జగిత్యాల: సంపత్ - 9676406002
ధర్మపురి: వెంకటేష్ - 8008019205
కోరుట్ల: సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899